క్లుప్తంగా

సీఎంను కలిసిన బీసీ నేతలు



ముఖ్యమంత్రితో బీసీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీసీ సంఘం ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామానికి చెందిన నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఆంజనేయులు ఉన్నారు.

మాజీ హోంమంత్రిని..

అబ్దుల్లాపూర్‌మెట్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోంమంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు తూళ్ల దేవేందర్‌గౌడ్‌ను గురువారం గీత పరివారముల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు గౌడ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ యాదగిరిరెడ్డి, సంఘం నాయకులు భూకైలాస్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, డొంకని బాల్‌రాజ్‌గౌడ్ ఉన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి సత్కారం

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మండల పరిధి నాయకులు గురువారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో వైస్ ఎంపీపీ మాజీ సభ్యుడు అనంతరెడ్డి, పోలెపల్లి మాజీ ఉపసర్పంచ్ దారెడ్డి అంజన్‌రెడ్డి, కేవీఎస్ఆర్ యువ సేన నాయకుడు విజయ్‌రాథోడ్ ఉన్నారు.

ఘనంగా కోదండరెడ్డి జన్మదిన వేడుకలు



యాచారం: కోదండరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఇబ్రహీంపట్నం రూరల్/యాచారం: తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్నం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, యాచారం మండల మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి ఉన్నారు.

యాచారంలో..

ముదిరెడ్డి కోదండరెడ్డి నివాసంలో కాంగ్రెస్ శ్రేణులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మహేశ్, రాజేష్ పార్టీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బలిజగూడ గ్రామస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రామానికి అదనపు బస్సు సర్వీసులను తిప్పాలని బలిజగూడ గ్రామస్తులు కోరారు. గురువారం హయత్‌నగర్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామం నుంచి నగరానికి వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజల సంఖ్య పెరిగిందని, అందుకు అనుగుణంగా సర్వీలు పెంచాలని పేర్కొన్నారు. దీనికి స్పందించిన మేనేజర్.. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు వెంకటేశ్, సతీష్ కుమార్, పవన్, సందీప్ తెలిపారు.

పరిమళించిన మతసామరస్యం



అయ్యప్పలకు నగదు అందజేస్తున్న ముస్లిం

ఇబ్రహీంపట్నం రూరల్: హిందూ ముస్లిం భాయ్‌భాయ్ అంటూ ఓ ముస్లిం వ్యక్తి మానవత్వం చాటుకున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లిలో 19 మంది అయ్యప్ప మాలధారులు గురువారం శబరిమలకు బయల్దేరారు. ఈ సందర్భంగా మంగళ్‌పల్లికి చెందిన ఆటో డ్రైవర్ ఉమ్మర్.. కుటుంబ సభ్యులతో అయ్యప్పలను దర్శించుకున్నారు. పండ్లు, వాటర్ బాటిల్స్‌తో పాటు రూ.101 నగదు అందజేశారు. అనంతరం వారిని సాగనంపారు. ఐదేళ్లుగా ఉమ్మర్ చేస్తున్న సేవకు పలువురు అభినందనలు తెలిపారు.

ఓవర్‌లోడ్.. రయ్‌రయ్

ఓవర్ లోడ్‌తో దూసుకుపోతున్న భారీ వాహనాలతో ఇతర వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయాందోళన చెందుతున్నారు. అలాంటి వాహనాలను అదుపుచేయడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. లారీలు, టిప్పర్లలో డస్టు, కంకర, ఇసుక, మట్టి తదితర వాటిని నిబంధనలకు విరుద్ధంగా వాహనం బాడీకిపైగా నింపుకొని, టార్పాలిన్లు కప్పకుండా తరలిస్తున్నారు. దీంతో వెనకాల వచ్చే వాహనదారులు ప్రమాదం బారిన పడే అవకాశం లేకపోలేదని, అయినా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కానరాని నిబంధనలు!

- అధిక లోడ్‌తో దూసుకుపోతున్న టిప్పర్లు
- ప్రమాదాల బారిన పడుతున్న ఇతర వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు



టార్పాలిన్ లేకుండానే జాతీయ రహదారిపై డస్ట్ లోడుతో దూసుకెళ్తున్న టిప్పర్

కొత్తూరు: భారీ వాహనాలు, ట్రాన్స్‌పోర్టు లారీల డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలి. ప్రమాదాల నివారణకు సహకరించాలని తరచూ ఆయా శాఖల అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ కొందరు డ్రైవర్లు కనీస నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులుగా మారుతున్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్ల గుండా కంకర, డస్ట్(రాయిపొడి)ను తరలిస్తున్న భారీ టిప్పర్ల (లారీలు) కారణంగా వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సామర్థ్యానికి మించి తరలింపు..

మండలంలోని ఇన్ముల్‌నర్వ, సిద్ధాపూర్ గ్రామాల శివార్లలో స్టోన్ క్రషర్లు కొనసాగుతున్నాయి. నిత్యం వ్యాపారులు తమకు వచ్చే ఆర్డర్లను ఇన్ముల్‌నర్వ–కొత్తూరు, ఇన్ముల్‌నర్వ–షాద్‌నగర్ రోడ్ల మీదుగా జాతీయ రహదారుల గుండా గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. డ్రైవర్లు వాటి యజమానుల ఆదేశాల మేరకు టిప్పర్లలో సామర్థ్యానికి మించి కంకర, డస్ట్‌ను తరలిస్తున్నారు. ఈ సమయంలో లారీల్లో నుంచి కంకర, డస్ట్ రోడ్డుపై కింద పడకుండా టార్పాలిన్లు చుట్టడం లేదు. కొందరు డ్రైవర్లు టిప్పర్లకు టార్పాలిన్లు కడుతున్నప్పటికీ లోడ్ అధికంగా ఉండడంతో స్పీడ్ బ్రేకర్ల వద్ద కంకర రాళ్లు కిందపడుతున్నాయి. ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్డు వెడల్పుగా ఉండడంతో టిప్పర్ల డ్రైవర్లు వేగంగా వాహనాలను నడిపే క్రమంలో కంకర రాళ్లు వెనకాల వచ్చే వాహనాలకు తగిలి అద్దాలు పగిలిన సందర్భాలు లేకపోలేదు. దీనికి తోడు టార్పాలిన్ కట్టకపోవడంతో గాలికి డస్ట్(రాయిపొడి) ఎగిరి ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

తనిఖీలు నిల్..

ఇన్ముల్‌నర్వ–కొత్తూరు, షాద్‌నగర్ రోడ్ల గుండా నిత్యం స్టోన్ క్రషర్లకు సంబంధించిన భారీ వాహనాలు పదుల సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటాయి. కొన్ని వాహనాల్లో సామర్థ్యానికి మించి వస్తువులు, కంకరను తరలిస్తున్నారు. మరికొన్ని వాహనాలు కంకర, డస్ట్ కింద పడకుండా టార్పాలిన్లు కట్టడం లేదు. వీటి కారణంగా రోడ్లపై పడుతున్న కంకర, డస్ట్‌తో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు సైతం గురవుతున్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా సామర్థ్యానికి మించి కంకర, డస్ట్‌ను తరలిస్తున్న భారీ టిప్పర్లపై సంబంధిత శాఖల అధికారులు కనీస తనిఖీలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్డు గుండా కంకర, డస్ట్‌ను తరలిస్తున్న టిప్పర్ల నుంచి రోడ్డుపై కంకర, డస్ట్ కింద పడుతోంది. వేగంగా వెళ్లే సమయాల్లో కంకర టిప్పర్ల వెనకాల వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలపై పడుతోంది. దీంతో కార్ల అద్దాలు పగలడంతో పాటు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి టిప్పర్ల డ్రైవర్లు టార్పాలిన్ కట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.

– మహేశ్, ఇన్ముల్‌నర్వ

చర్యలు తీసుకుంటాం



కంకర, డస్ట్‌తో పాటు ఇతర వస్తువులు తరలించే భారీ వాహనాల డ్రైవర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. కంకర, డస్ట్ కింద పడకుండా టార్పాలిన్లు కట్టాలి. ఇన్ముల్‌నర్వ–కొత్తూరు రోడ్డులో తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని లారీలపై చర్యలు తీసుకుంటాం.

– నర్సింహారావు, సీఐ, కొత్తూరు

హెచ్‌ఎంపై దాడిని ఖండిస్తున్నాం

- నిందితులను వెంటనే శిక్షించాలి
- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య



నిరసన తెలుపుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: తుక్కుగూడలో హెచ్‌ఎం రాములుపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. రాములుపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణ ముఖ్య కూడలిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. అయ్యప్ప మాల ధరించిన విద్యార్థి పాఠాలను సరిగా అప్పజెప్పకపోవడంతో హెచ్‌ఎం రాములు అందరు విద్యార్థుల మాదిరిగానే మందలించారని తెలిపారు. ఈ విషయాన్ని కొందరు అయ్యప్ప భక్తులు వివాదస్పదం చేస్తూ అయ్యప్పలను అవమానించినట్లుగా చిత్రీకరించి హెచ్‌ఎంను అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేయడం సరికాదన్నారు. రాములుపై దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు, మండల ప్రధాన క్యాదర్శి సత్యం, నాయకులు నర్సింలు, కృష్ణ, నర్సింహులు, లక్ష్మీదేవమ్మ, సమత, జ్యోతిర్మయి, అరుణ, శేఖర్‌గౌడ్, సురేందర్, శివరాములు, రవికుమార్, రాములు, మహేశ్, డీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, తిరుమలయ్య ఉన్నారు.

నృసింహుడి సన్నిధిలో పడిపూజ



పడిపూజ, ఇరుముడి కార్యక్రమాలకు హాజరైన భక్తులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద అయ్యప్ప మాలధారులు గురువారం మహాపడి పూజ, ఇరుముడి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. మాజీ పట్వారి జైశ్రీ రాంరెడ్డి అయ్యప్ప మాలధారులకు, భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని సమర్పించారు.

విద్యార్థుల కోసం.. కలెక్టర్‌కు దుప్పట్ల అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కలెక్టర్ నారాయణరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ వసతిగృహం విద్యార్థుల కోసం 100 దుప్పట్లు, నోట్ పుస్తకాలను కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌లను నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్, కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, శశిధర్ రెడ్డి, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న రామస్వామి, నాయకులు

చేవెళ్ల: గ్రామ గ్రామాన సీపీఐ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండలంలోని పలుగుట్ట గ్రామంలో గురువారం పార్టీ వంద వసంతాల ఉత్సవాల్లో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పార్టీని గ్రామాల్లో మరింత బలోపేతం చేయాలన్నారు. దేశంలోనే వంద ఏళ్ల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అన్నారు. కార్మికులు, కర్షకుల పక్షాన నిలబడి నిరంతరం పోరాటాలు చేస్తూ వారికి న్యాయం చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదును పెద్దఎత్తున చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణ, సత్తిరెడ్డి, శ్రీనివాస్, సుధీర్, అంజయ్య, బాబురావు, యాదగిరి, మంజుల, మీనాక్షి, కళావతి, పద్మ, రఘు, సత్తయ్య, యాదమ్మ తదితరులు ఉన్నారు.

సేవాలాల్ జీవిత చరిత్రను కాపాడుకోవాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్



నాటక ప్రదర్శనలో పాల్గొన్న రాంబాల్‌నాయక్

కేశంపేట: సంత్ శ్రీ సేవాలాల్ జీవిత చరిత్రను కాపాడి ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని పోల్కొనిగుట్టతండా గ్రామంలో కళాకారులు సేవాలాల్ జీవిత చరిత్రను నాటక రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాంబాల్‌నాయక్ పాల్గొని నాటికను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సేవాలాల్ నాటక ప్రదర్శన ద్వారా లిపి లేని లంబాడీల చరిత్రను ప్రజలకు వివరించే అవకాశం ఉందన్నారు. బంజారా సమాజం ఆచారాలు, వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాల గూర్చి నాటిక ద్వారా వివరించారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షులు రాజునాయక్, లక్ష్మణ్‌నాయక్, జగన్‌నాయక్, పుట్యానాయక్, శంకర్‌నాయక్, రమేశ్‌నాయక్, భాస్కర్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

'పీఎం కిసాన్' పెంపుపై హర్షం

చేవెళ్ల: దేశంలోని రైతుల సంక్షేమం కోసం పనిచేసే ప్రధాని మోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని పెంచినందుకు ఎంతో సంతోషంగా ఉందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ముందు చూపుతో రైతుల కోసం నూతన సంవత్సరంలో సంతోషాన్ని ఇచ్చే విధంగా పీఎం కిసాన్‌ను 6వేల నుంచి 10వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు. ఇది నిజంగా రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులకు ఇది వర్తిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు.

నిందితులను శిక్షించాలి



కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ జేఏసీ నాయకులు

మంచాల: ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. గత నెల 23న తుక్కుగూడలోని పాఠశాలలో అయప్ప మాలధారణలో ఉన్న(విద్యార్థి) బాలుడికి హెచ్‌ఎం కాలు తాకిందన్న కారణంతో మూకుమ్మడిగా కొందరు దాడి చేయడమే కాకుండా.. హెచ్‌ఎంతో ఆ విద్యార్థి కాళ్లు మొక్కించారని వెల్లడించారు. హెచ్‌ఎంకు న్యాయం చేయాలని పహాడీషరీఫ్ ఠాణాలో ఫిర్యాదుచేశామని పేర్కొన్నారు. అయినప్పటికీ నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దాడి చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు భాస్కర్, బి.కృష్ణ, యాదయ్య, సుధాకర్, శ్రీను, అంజయ్య, భిక్షపతి, లింగం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవనం నిర్మించాలి

ఆమనగల్లు: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్‌లు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆమనగల్లు పట్టణంలో కళాశాల ఏర్పాటు చేసి 23 సంవత్సరాలు గడిచినా, నేటికీ సొంత భవనం లేదని పేర్కొన్నారు. అరకొర వసతుల మధ్య ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతుండగా.. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సుమారు 300 మంది విద్యనభ్యసిస్తున్న కళాశాలకు కేవలం రెండు గదులు మాత్రమే కేటాయించారని వెల్లడించారు. దీంతో తరగతి గదులు సరిపోక.. చెట్ల కిందే చదువు కొంటున్నారని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కళాశాలకు భవనం నిర్మించాలని కోరారు. ఇందులో నాయకులు శివశంకర్, చరణ్, శ్రీకాంత్, స్టాలీన్, వంశీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి



పుల్యానాయక్ కుటుంబీకులను పరామర్శిస్తున్న చల్లా

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి విఠాయిపల్లిలో పార్టీ నాయకుడు పుల్యానాయక్ ఇటీవల మృతిచెందగా.. గురువారం మృతుడి కుమారుడు శ్రీధర్‌నాయక్, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, మాజీ అధ్యక్షుడు రాములు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలి



తహసీల్దార్ సునీతరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతరెడ్డికి పీఆర్టీయూ నేతలు గురువారం వినతి పత్రం సమర్పించారు.

అటెండెన్స్ సర్టిఫికెట్లు..

గతేడాది నవంబర్‌లో సమగ్ర కుటుంబ సర్వేలో సెలవు దినాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలని పీఆర్టీయూ నేతలు కోరారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ జంగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం మండల అధ్యక్షుడు పరమేశ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సుదర్శన్‌రెడ్డి, జమీర్, ప్రదీప్‌రెడ్డి, మురారి, ఆనంద్‌కుమార్‌లు ఉన్నారు.

ప్రతి నిరుపేదకు ఇల్లు ఇస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



పెద్దఎల్కిచర్లలో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తుందన్నారు. సర్వేలో పేదలు ఎవరు తప్పిపోకుండా చూడాలన్నారు. దివ్యాంగులు, వితంతువులకు తప్పనిసరిగా లబ్ధిచేకూరేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కొందుర్గు మండలంలోని ఆగిర్యాలలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురువారం ఆగిర్యాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు సంయమనం పాటించాలని, ఐకమత్యంతో క్రీడల్లో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. నాయకులు మల్లేశ్‌గౌడ్, వెంకటనర్సింహారెడ్డి, ఆంజనేయులు, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలి

షాద్‌నగర్‌రూరల్: పద్మశాలీలు ఐకమత్యంతో ముందుకు సాగుతూ ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని పద్మశాలి భవనంలో సంఘం ఆధ్వర్యంలో నూతన కేలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైతు సంక్షేమమే మోదీ లక్ష్యం



తలకొండపల్లి: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

- కిసాన్ సమ్మాన్ నిధి పెంచిన కేంద్రం
- ఎరువులపై రాయితీ ప్రకటన హర్షణీయం
- బీజేపీ నాయకులు
- ప్రధాని చిత్రపటాలకు క్షీరాభిషేకం

తుర్కయంజాల్: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పనిచేస్తున్నారని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి పెంపు సందర్భంగా పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు తూళ్ల నర్సింహా గౌడ్ అధ్యక్షతన తుర్కయంజాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్ యోజన పథకం కింద ఇప్పటి వరకు రూ.6 వేలు ఇస్తున్న కేంద్రం.. 10వేలకు పెంచిందని పేర్కొన్నారు. ఎరువులపై రాయితీని ప్రకటించడం హర్షణీయమన్నారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే మున్సిపాలిటీలోని 52 బూత్‌లకు గాను 29 కమిటీలను ఎన్నుకున్నామని, ఒక్కో కమిటీలో 12 మంది సభ్యులు ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి రమేష్, సీనియర్ నాయకుడు బల్‌దేవ్ రెడ్డి, రైతు సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

ఆమనగల్లు: రైతులకు అందించే కిసాన్ సమ్మాన్ నిధిని రూ.6 వేల నుంచి 10 వేలకు కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఈ నేపథ్యంలో తలకొండపల్లి మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. రైతులతో కలిసి సంబురాలు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రవిగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండు ఉన్నారు.



మాడ్గుల: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

రైతు పక్షపాతి ప్రధాని మోదీ

మాడ్గుల: పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని రూ.6వేల నుంచి రూ.10 వేలకు ప్రధాని మోదీ పెంచారని బీజేపీ నాయకులు తెలిపారు. సాగు పెట్టుబడి సాయం పెంపు సందర్భంగా గురువారం మండల పరిధి ఇర్విన్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతు పక్షపాతి ప్రధాని మోదీ అని పేర్కొన్నారు. పార్టీ నాయకులు పెద్దయ్య యాదవ్, వెంకటయ్య, అశోక్, భూపేష్ చారి, శంకర్, హరీశ్‌రెడ్డి, రాజిరెడ్డి, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.